విద్యార్థులకు సన్మానం

సిద్దిపేట, జూలై 12: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కృషివల్లనే రాష్ట్రంలోనే అత్యధికంగా సిద్దిపేట నియోజకవర్గంలో బాసర త్రిపుల్‌ఐటీ సీట్లు వచ్చాయని టీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పడిగే ప్రశాంత్, పిట్ల రాకేశ్ అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం బాసర త్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన సిద్దిపేట రూరల్ మండలంలోని చిన్న గుండవెల్లి, ఇర్కోడ్, చింతమడక జడ్పీహెచ్ఎస్ విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే హరీశ్‌రావు టెన్త్ విద్యార్థులకు సొంతంగా డిజిటల్ కంటెంట్ మెటీరియల్, సాయంత్ర స్నాక్స్ అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో

ఇర్కోడ్ మోడల్ స్కూల్ విద్యార్థులను సన్మానిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవీందర్, బుచ్చిబాబు, అజిత్, బీఆర్ఎస్వీ నాయకులు తిరుపతి, వంశీ, కరుణాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయం

విద్యార్థులను సన్మానిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

నంగునూరు, జూలై 12 : టెన్త్ ఫలితాల్లో నంగునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నంగునూరు ఉన్నత పాఠశాలలో ఇటీవల బాసర త్రిపుల్ ఐటీలో సీటు సాధించిన 19 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పాఠశాల ఆధ్వర్యంలో సన్మానించారు. సిద్దిపేటకు చెందిన బీఆర్ ఫౌండేషన్ వారు పాఠశాలకు ఐదు కంప్యూటర్లు, ఒక ప్రింటర్ బహూకరించిన సందర్భంగా వాటిని డీఈవో ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు రామస్వామి, ఇన్‌చార్జి రవీంద్రారెడ్డి, నాగలక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

'కస్తూర్బా'ను సందర్శించిన ఎంఈవో

మద్దూరు(ధూళిమిట్ట), జూలై12: మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కస్తూర్బాగాంధీ పాఠశాలను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు పాఠశాలలో ఉన్న వసతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఎంఈవో రుచి చూశారు. ఆయన వెంట సీఆర్పీలు ఉన్నారు.

కస్తూర్బా పాఠశాలలో భోజనం చేస్తున్న ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి

గోదావరి జలాలు విడుదల చేయాలి

కొమురవెల్లి, జూలై 12 : మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు విడుదల చేయాలని శుక్రవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, ఐనాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు రమాణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రిజర్వాయర్‌లోకి నీళ్లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాయిత శ్రీనాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలిగింపు

హుస్నాబాద్‌టౌన్, జూలై 12: హుస్నాబాద్ పట్టణంలోని 1వ వార్డులో అప్నాభీమా రిభగావో, చెత్తాచెదారంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక తాగునీటి ట్యాంకుచుట్టూ ఉన్న చెత్తాచెదారాన్ని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్నతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తొలిగించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో రోగాలు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడిచెత్తతో ఎరువు తయారుచేసి మొక్కలకు వేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్‌వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ టి.మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్ కొంకట నళిని

ఒకటోవార్డులో చెత్తాచెదారాన్ని తొలిగిస్తున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న తదితరులు

దేవి, కోఆప్షన్ సభ్యుడు ఆయూబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, ఎన్విరాన్ మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారి ఎల్ల య్య, జవాన్లు సారయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

కొమ్మూరి ఆక్రమించిన భూములను అప్పగించాలి

చేర్యాల, జూలై 12 : మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆక్రమించిన ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని మిత్రపక్షాల నాయకులు డిమాండ్ చేశారు.శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కొమ్మూరి భూ ఆక్రమణల పై సీపీఎం(ఎం),ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, తెలంగాణ మాదిక రిజర్వేషన్ పోరాట సమితి మిత్రపక్షాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చేర్యాల టౌన్, ముస్త్యాల, లద్నూరు, బంజర గ్రామాల్లో 30ఎకరాల 21గుంటల ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్ మిగులు భూములను అధికార బలంతో అనుభవిస్తున్నాడన్నారు.చట్టాలను అతిక్రమించిన కొమ్మూరిని కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి నుంచి తొలిగించాలన్నారు. చేర్యాల శివారులోని 1030 సర్వేనెంబర్‌లో ఏడు ఎకరాల ఒక గుంట విస్తీర్ణం భూదాన్ భూమిని స్వాధీనం చేసుకుని పట్టణంలో ఇళ్ల స్థలాలు లేని కుటుంబాలకు పంపిణీ చేయాలని కోరారు.984, 985, 997 సర్వే నంబర్లలో నిబంధనలకు వ్యతిరేకంగా వెంచర్ చేసి మున్సిపాలిటీకి వదిలిపెట్టాల్సిన రెండు ఎకరాల భూమిని ఇవ్వకుండా విక్రయించుకున్నట్లు ఆరోపించారు.ఈ భూమిని క్రయవిక్రయాలు జరుపకుండా చేర్యాల మున్సిపాలిటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, ఆల్‌ఇండియాఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందే బీరయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒగ్గు రాజు, టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్, సీపీఎం నాయకులు కొంగరి వెంకట్‌మావో, రాళ్లబండి నాగరాజు, బండకింది అరుణ్‌కుమార్, ముస్త్యాల ప్రభాకర్, రాళ్ల బండి భాస్కర్, శోభ, చందు, అశోక్, భాస్కర్, భూమిగారి నర్సింహులు, కుమార్, గుండ్ర రవీందర్, చంద్రం పాల్గొన్నారు.

చేర్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న మిత్రపక్షాల నాయకులు

ఘనంగా బోనాల పండుగ

రాయపోలు, జూలై 12: మండలంలోని వడ్డేపల్లిలో శుక్రవారం రాత్రి పోచమ్మకు బోనాలు తీశారు.ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు అలరించాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామస్తులు కోరుకున్నారు.

వడ్డేపల్లిలో బోనాలను తీసుకువెళ్తున్న మహిళలు

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించాలి

ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

సిద్దిపేట, జూలై 12 : విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని చంద్రమౌళిగార్డెన్‌లో వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ తరగతులు, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు మెరుగైన క్రీడాకారులను తయారు చేయాలన్నారు. ఓరియంటేషన్ ట్రైనింగ్‌లో భాగంగా వ్యాయామ విద్య ప్రాధాన్యతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఎస్సై నరేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఉద్యోగోన్నతులు పొందిన వ్యాయామ విద్య ఉపాధ్యాయులను ఎమ్మెల్సీ సన్మానించారు.కార్యక్రమంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, గౌరవ అధ్యక్షుడు సోమేశ్వరరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సతీశ్, హరికృష్ణ, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ మాధవరెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ రామేశ్వర్‌రెడ్డి, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇంద్రసేనారెడ్డి, శ్రీనాకర్‌రెడ్డి, మురళీధర్, ఇలియాస్‌రావు, రమణారెడ్డి, విజయరేఖ, లక్ష్మీనారాయణ, భిక్షపతి, రామనర్సయ్య, రాజమోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

పర్యావరణాన్ని పరిరక్షించాలి

బెజ్జంకి: పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, క్లబ్ సభ్యులు

మిరుదొడ్డి జూలై 12 :గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీస్ మేనేజర్ సమ్మయ్య అన్నారు. శుక్రవారం ఇండియన్ గ్యాస్ గోదాం ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు ఈ సందర్భంగా మాట్లాడుతూ చెట్లను నరకడం వల్ల వర్షాలు పడటానికి ఇబ్బందిగా మారిందన్నారు.కార్యక్రమంలో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వనమహోత్సవం

బెజ్జంకి, జూలై 12: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వడ్లకొండ శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షుడు నారోజు శంకరాచారి, కార్యదర్శి బెజుగం విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

జగదేవ్‌పూర్, జూలై12: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని రత్నశ్రీ భారత్ గ్యాస్ ఏజెన్సీస్ నిర్వాహకుడు సంజయ్ గుప్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పౌరసరఫరాలశాఖ ఆదేశాల మేరకు తమ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. మహేశ్, హరిగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్ మున్సిపాలిటీకి రూ.20కోట్లు మంజూరు

హుస్నాబాద్‌టౌన్, జూలై 12: హుస్నాబాద్ మున్సిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ కింద రూ. 20కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎల్లమ్మచెరువు సుందరీకరణతోపాటు పలు ప్రాంతాల్లోని చౌరస్తాలను అభివృద్ధి చేసేందుకు ఈ నిధులను మంజూరు చేసినట్లు మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న తెలిపారు. పట్టణాభివృద్ధి కోసం నిధులు మంజూరుచేయించిన బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు హుస్నాబాద్ మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, ప్రజల తరపున ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

వర్గల్,జూలై12: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని వర్గల్ మండల ఎంపీపీ జాలిగామ లతారమేశ్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మజీద్‌పల్లిలో ఆయమ్మ (బాలమ్మ) పదవీ విరమణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చాలా గ్రామాల్లో బియ్యం,కోడిగుడ్ల పంపిణీలో ఇబ్బందులు కలుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. గ్రామ మాజీ సర్పంచ్ లతాశివరాంగౌడ్ పాల్గొన్నారు

తొలిగిన ముళ్లపొదలు

వర్గల్,జూలై 12:మండలంలోని సామల పల్లి,నెంటూర్ గ్రామాల మధ్యగల సామలచెరువు కట్టపై ఉన్న ముళ్లపొదల వల్ల ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరు గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు ఇరిగేషన్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కట్టపై పెరిగిన సర్కారు తుమ్మ, నల్లతుమ్మ చెట్లను ఇరిగేషన్‌శాఖ సిబ్బంది శుక్రవారం తొలిగించారు. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

చెట్లను తొలిగిస్తున్న సిబ్బంది

టూరిజం చైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ

మిరుదొడ్డి, జూలై 12 : టూరిజం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి పటేల్ రమేశ్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల రాజే శం. నాయకులు విజయ్‌రెడ్డి, చెన్నై భూపాల్‌గౌడ్, కిష్టాగౌడ్, పద్మారెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో పటేల్ రమేశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

వైభవంగా మైసమ్మ ఆలయ ఉత్సవాలు

సిద్దిపేట టౌన్,జూలై 12 : పట్టణంలోని మహా మైసమ్మ ఆలయ ఉత్సవాలు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో సామూహిక కుంకుమార్చన జరిగింది.అంతకు ముందు ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున్న అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

విద్యార్థిని ఆత్మహత్య

సిద్దిపేట టౌన్,జూలై 12 : యువకుడి వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలో కాళ్లకుంట కాలనీకి చెందిన కావ్య (17) ఇంటర్ చదువుతుంది. గత సంవత్సరం నుంచి తేజ అనే యువకుడు కావ్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. అతడి వేధింపులు తట్టుకోలేక శుక్రవార ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

తుక్కాపూర్‌లో గ్రోత్ మేళా

తొగుట, జూలై 12 : మండలంలోని తుక్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రోత్ మేళా నిర్వహించారు. పౌష్టికాహారం ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింగరావు,అంగన్‌వాడీ టీచర్లు దూలం రేణుక, గజ్జెల రేఖ, చిక్కుడు స్వరూప, గ్రామ సమైక్య సంఘం సభ్యులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

తుక్కాపూర్‌లో గ్రోత్ మేళాలో పాల్గొన్న గర్భిణులు, చిన్నారులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

సిద్దిపేట, జూలై 12: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అన్నారు. శుక్రవారం సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 31, 32వ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ప్రసన్నారాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, స్థానిక వార్డు కౌన్సిలర్ బంగారం శ్రీలతారాజులతో కలిసి ఆమె ఫ్రైడేలో పాల్గొన్నారు. నివాస గృహ సముదాయాల ముందు నిల్వఉన్న నీరు, కుండీల్లో నిల్వ ఉన్న నీటిని తొలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలకుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండడం వల్ల సీజనల్ వ్యాధులు వస్తాయన్నారు. మురుగు కాల్వల్లో దోమలు వ్యాప్తి చెందకుండా రసాయనాలను పిచికారీ చేసి ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. సిద్దిపేట ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించిన గొప్ప కార్యక్రమం 'నడుస్తూ చెత్త ఏరుట' అన్నారు. అనంతరం హరిత శుక్రవారంలో భాగంగా ఎర్ర చెరువు కట్టపై ఉన్న మొక్కలకు నీటిని పట్టారు. పట్టణంలోని భారత్‌నగర్‌లో ఒక వ్యక్తి దోమ కాటు వల్ల డెంగీ వచ్చిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి ఇంటి పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ మల్లికార్జున్, శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ వనిత, హరితహారం అధికారి ఐలయ్య, శానిటరీ జవాన్ రాజేశ్, స్థానిక వార్డు ఆర్పీలు పాల్గొన్నారు.

హరిత శుక్రవారంలో భాగంగా మొక్కలకు నీరు పడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్

పాండురంగ ఆశ్రమానికి పాదయాత్ర

పాండురంగ ఆశ్రమానికి చేరుకున్న వైష్ణవభక్తులు

మర్కుక్,జూలై 12: మండల కేంద్రానికి సమీపంలోని భవానందపూర్ గ్రామ అటవీ ప్రాంతంలో వెలిసిన శ్రీవైష్ణవ ఆశ్రమక్షేత్రం శ్రీపాండురంగ ఆశ్రమానికి తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం కేశవాపూర్,లక్ష్మాపూర్, కర్కపట్ల, దామరకుంట గ్రామాలకు చెందిన భక్తజనమండలి సభ్యులు పాదయాత్ర ద్వారా శుక్రవారం మర్కుక్ పాండురంగ ఆశ్రమానికి చేరుకున్నారు. అనంతరం శ్రీపాండురంగడిసేవలో భజన, గీతాలాపనలతో గడిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

గజ్వేల్, జూలై 12: గజ్వేల్ పట్టణంలోని ప్రధాన వ్యాపార సముదాయల వద్ద రోడ్లపై వాహనాలను నిలుపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుందని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వాహనాలను నిలుపుకోవాలని సీఐలు సైదా, మురళి తెలిపారు. శుక్రవారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన సందర్భంగా దుకాణాల ముందు ఉన్నవాహనాలు, ప్రచార బోర్డులను తొలిగించి దుకాణాదారులకు అవగాహన కల్పించారు. రోడ్లపైనే సామాన్లు పెట్టడంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉంటుందని, నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. ఎవరైనా వ్యాపారులు అడ్డదిడ్డంగా సామాన్లు పెడితే కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు.

వెలిగిన బట్టర్‌పై లైట్లు

గజ్వేల్, జూలై 12: ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని రోడ్ల డివైడర్ మధ్యలో వేసిన స్తంభాలకు లైట్లను బిగించారు. కాలనీ నిర్మాణం జరిసప్పుడు లైట్ల వేసేందుకు అధికారులు స్తంభాలు ఏర్పాటు చేశారు. వారం రోజులుగా డివైడర్ మధ్యలోని బట్టర్ పై లైట్లను బిగించడంతో వాటిని గురువారం రాత్రి ప్రారంభించారు.

కాలనీలో వెలుగుతున్న బటర్‌పై లైట్లు

విజయవంతమైన జాబ్ మేళా

జాబ్ మేళాకు తరలివచ్చిన యువతీ యువకులు

సిద్దిపేట టౌన్,జూలై 12 : తెలంగాణ స్కిల్స్ నాలెడ్జి సెంటర్,ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన మెగా జాబ్ మేళా విజయవంతమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్ తెలిపారు. వివిధ ఉద్యోగాల కోసం వందలాది మంది నిరుద్యోగ యువతీ యువకులు తరలిరాగా, 125 మంది ఉద్యోగాలు సాధించారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్‌రావు, మధుసూదన్ పాల్గొన్నారు.

పీర్ల పండుగ సందడి

మిరుదొడ్డి, జూలై 12 : మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఈ నెల 8వ తేదీన నెలవంక కనిపించడంతో ముస్లిం లు, హిందువులకు చెందిన పీర్లను గ్రామాల్లో నెలకొల్పారు. దీంతో గ్రామాల్లో పీర్ల పండుగ సందడి నెలకొంది. ఈ నెల 16వ తేదీన పీర్లకు మట్కీలు తీయగా 17వ తేదీన పీర్ల పండుగ వైభవంగా జరుపుకోవటానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

రేబర్తిలో...

మద్దూరు(ధూళిమిట్ట), జూలై12: ఈ నెల 17న జరిగే మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని పలు గ్రామాల్లో పీర్ల సందడి నెలకొంది. గ్రామాల్లో పీర్ల కొట్టాల్లో పీర్లు నిలబెట్టి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రోజంతా ముజావర్లు పీర్లను ఎత్తుకొని గ్రామాల్లో ఊరేగిస్తున్నారు.

నేడు గురుపూజోత్సవం

హుస్నాబాద్‌టౌన్, జూలై 12: హుస్నాబాద్‌లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ ఖండకార్యవాహ కనపర్తి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్రీరాజరాజేశ్వర ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా మెదక్ విభాగ్ సంపర్క్ ప్రముఖ్ గొల్కొండ రాఘవులు, ముఖ్యఅతిథిగా అక్కన్నపేట సర్పంచ్ సంజీవరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

బాధిత రైతు వాంగ్మూలం రికార్డు

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 12 : భూ వివాదాలతో విసిగి గురువారం సాయంత్రం కొండపాక మండలంలోని దమ్మక్కపల్లికి చెందిన పెద్ద బండోల్ల కిష్టయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఆర్‌వీఎం దవాఖానలో చికిత్స పొందుతున్న అతడి నుంచి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

గజ్వేల్, జూలై 12: అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్థానిక పోలీసులచే పట్టుబడిన 24 కేసులకు సంబంధించిన మద్యాన్ని ఎక్సైజ్, స్థానిక పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. 37కాటన్ల బీర్లు, క్వాటర్ బాటిళ్లను సిద్దిపేట అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జగన్నాథ్, ఎక్సైజ్ సీఐ బ్రహ్మానందరెడ్డి, సీఐ సైదా ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన కేసులకు సంబంధించిన 24 కాటన్ల మద్యం బాటిళ్లను కూడా ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

14న నవోదయ మోడల్ టెస్ట్

గజ్వేల్, జూలై 12: గజ్వేల్ పట్టణంలోని విశ్వతేజ జూనియర్ కళాశాలలో ఈనెల 14వ తేదీన ఉదయం 10గంటలకు నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు శ్రీచైతన్య కోచింగ్ సెంటర్ డైరెక్టర్ కరుణాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నారాయణరావుపేట, జూలై 12 : గృహజ్యోతి కార్యక్రమంలో భాగంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జీరో బిల్లు కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడానికి రావడంతో కోలాహలంగా మారింది. లబ్ధిదారులు క్యూలో ఉండి దరఖాస్తులు సమర్పించారు. గృహజ్యోతి పథకంలో అర్హులైన వారి కోసం ఆన్‌లైన్ నమోదుకు రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అధికారులు తెలిపారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

బెజ్జంకి, జూలై 12: మండలంలోని గుండారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన గిరిబాబు, తిరుపతి బదిలీపై వెళ్లగా వారిని ప్రధానోపాధ్యాయుడు రామంచ రవీందర్, ఇతర ఉపాధ్యాయులు శుక్రవారం సన్మానించారు. పాఠశాల బలోపేతం కోసం వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి వీడ్కోలు

హుస్నాబాద్‌రూరల్, జూలై 12 : మండలంలోని మడప ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బద్ధి